క్లుప్తంగా

జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ హెచ్ఓడీగా ప్రసాద్



కరప: ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో 8 క్రీడాంశాలకు హెచ్ఓడీ (హెడ్ ఆఫ్ డెలిగేషన్) గా మండలం పెద్దాపుర ప్పాడు బిరుదా సూర్యనారాయణ (ఫకీర్రావు) జెడ్పీ ఉన్నత పాఠశాల పీడీ, కాకినాడ స్కూల్ గేమ్స్ సెక్రటరీ బీవీవీఎస్వీ ప్రసాద్ నియమితులైనట్టు హెచ్ఎం ఎస్ఎస్ఎస్ శ్రీనివాస్ ఆదివారం ఒకప్రకటనలో తెలిపారు. అండర్-19 విభాగంలో 66వ జాతీయ క్రీడాపోటీలు మంగళవారం నుంచి 13వ తేదీ వరకు జరుగుతాయన్నారు. ఈ మేరకు స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నుంచి ఉత్తర్వులు వచ్చినట్టు హెచ్ఎం తెలిపారు. పీడీ ప్రసాద్ ఆదివారం ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు.

బదిలీల్లో ఖాళీ పీడీ పోస్టులను చూపండి

నాగమిల్లితోట జంక్షన్: 117 జీఓ ప్రకారం పాఠశాలల్లో పెరిగిన స్కూల్ అసిస్టెంట్ పీడీ పోస్టులను ప్రస్తుతం జరుగుతున్న బదిలీల్లో ఖాళీలుగా చూపాలని వ్యాయామ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.జార్జి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ మేరకు పాఠశాల కమిషనర్‌కు ఒక వినతి పత్రం సమర్పించారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా పీడీ పోస్టులు పెరిగాయని, అలాగే విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న చోట ఆ పోస్టులు రద్దయ్యాయని అన్నారు. బదిలీల్లో ఈ ఖాళీలు చూపకపోతే సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతుందన్నారు.

కౌలు చట్టంలో నిబంధనలు మార్చాలి

కరప: కౌలు చట్టంలో భూ యజమాని సంతకం నిబంధన ఎత్తివేయకపోతే కౌలురైతుకు ఏమాత్రం ఉపయోగం ఉండదని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.రాజశేఖర్ అన్నారు. కౌలురైతు రాష్ట్ర జాతా ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన నడకుదురు, కొరిపల్లి, వలసపాకల గ్రామాల్లో పర్యటించి కౌలు రైతులకు కరపత్రాలిచ్చి ప్రచారం నిర్వహించారు. కౌలుదారులకు న్యాయం చేయాలనుకుంటే ఆర్బీకే సిబ్బంది క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి పంట సాగుచేసే వారిని గుర్తించి, వారి పేరున ఈ-క్రాప్ నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రధానమైన ఈ డిమాండ్‌తో రాష్ట్రవ్యాప్తంగా జాతా నిర్వహించి, ఈ నెల 12న విజయవాడ నుంచి ప్రకాశం బ్యారేజీ మీదుగా మంగళగిరిలోని సీసీఎల్ఏ కార్యాలయం వరకు పాదయాత్ర చేపట్టామన్నారు.

తాగునీరు వృథా



ఫౌంటైన్‌లా వెదజల్లుతున్న తాగునీరు

కరప: పైప్‌లైన్ లీకవ్వడంతో తాగునీరు వృథాగా పోతోంది. మండల పరిధిలోని వేములవాడ గ్రామానికి పెనుగుదురు బోర్ నుంచి పైపులైన్ ద్వారా తాగునీరు సరఫరా అవుతోంది. కరపలోని సామూహిక రక్షిత నీటి పథకం నుంచి తాగునీరు సరఫరా చేస్తారు. వలసపాకల సమీపంలో ఈ పైప్‌లైన్‌కు చిన్న రంధ్రం నీరు పోతోంది. అధికారులు స్పందించి పైపులైన్ లీక్‌ను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో ఏరువాక పౌర్ణమి

కరప: మండలంలో టీడీపీ నాయకులు రెండు వర్గాలుగా ఏరువాక పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. మాజీఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, ఆపార్టీ రాష్ట్రకార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి తదితరులు ఒక వర్గంగా, గొర్రిపూడి గ్రామంలో, కాకినాడజిల్లా టీడీపీ ప్రధానకార్యదర్శి పెంకే శ్రీనివాసబాబా, వాసిరెడ్డి ఏసుదాసు తదితరులు మరో వర్గంగా వేములవాడ గ్రామంలో కార్యక్రమాలను నిర్వహించారు.

వాహనాలు సీజ్

తుని: నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న 29 వాహనాలను సీజ్ చేసినట్టు పట్టణ సీఐ నాగదుర్గారావు ఆదివారం తెలిపారు. జిల్లా ఎస్పీ ఎం.సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి పర్యవేక్షణలో పట్టణంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టామన్నారు. పట్టణ ప్రధాన కూడళ్లలో పటిష్టంగా గస్తీ నిర్వహించి బండి రికార్డు సక్రమంగా లేని వాహనాలపై వెళుతున్న, మద్యం సేవించి వాహనాలు నడిపిన, అనవసరంగా రోడ్లపై తిరిగే ఆకతాయిలపై చర్యలు తీసుకున్నామన్నారు. 110 వాహనాలను తనిఖీ చేసి పత్రాలు లేని 24 మోటారు సైకిళ్లు, 3 కార్లు, ఆటో, ఒక లారీని సీజ్ చేశామన్నారు.

ప్రకృతే పాఠ్యాంశం

- జేఎన్‌టీయూకేలో పర్యావరణ పరిరక్షణకు కృషి
- నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం



గ్రంథాలయం పక్కన ఏర్పాటు చేసిన మియావాకీ ప్లాంటేషన్



జంగిల్ బుక్ పేరుతో చెట్ల కింద నిర్వహిస్తున్న తరగతులు

బాలాజీచెరువు: పర్యావరణ పరిరక్షణను క్షేత్రస్థాయిలో అమలు చేసేలా జేఎన్‌టీయూకే అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జగనన్న హరిత నగరాలు పేరుతో ప్రభుత్వం సరికొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుట్టగా, అదే బాటలో యూనివర్సిటీలు సాగుతున్నాయి. దాదాపు 70 ఎకరాల జేఎన్‌టీయూకే విస్తీర్ణంలో సగం వరకు ఖాళీస్థలం ఉన్నది. ఈ ప్రాంతాల్లో మొక్కలు నాటి పచ్చని వాతావరణం కల్పించాలని వర్సిటీ భావిస్తోంది. రహదారికి ఇరువైపులా మొక్కలతో పాటు ఖాళీ ప్రాంతాల్లో వివిధ జాతుల మొక్కలను నాటడానికి చర్యలు తీసుకుంటున్నారు. గత ఏడాది జూన్‌లో వర్సిటీ గ్రీన్ క్యాంపస్ ఆడిట్‌లో అవుట్‌స్టాండింగ్ పెర్మార్మెన్స్ సర్టిఫికెట్ సాధించింది. గ్రీన్ క్యాంపస్ ఆడిట్‌కు సంబంధించి 2021–22కు ఆడిటింగ్‌లో గ్రీన్ క్యాంపస్ ఎకోస్కోర్ 53 శాతం పొందింది. ఈ ఏడాదాకి 65 శాతం సాధించేలా కృషిచేస్తున్నారు. ఎనర్జీ సీవరేజ్ (వేస్ట్ వాటర్ మేనేజ్‌మెంట్) కార్బన్ క్రెడిట్స్ (కర్బన ఉద్గారాలు) గ్రీన్ బిల్డింగ్, ఇ-వేస్ట్ మేనేజ్‌మెంట్, టెర్రస్ ఫార్మింగ్, కాంపోస్టింగ్ వంటి అంశాలు పరిగణలలోకి తీసుకుని స్కోర్ విడుదల చేశారు. నేషనల్ అక్రిడేషన్ బోర్డు లిమిటెడ్ కేంద్ర ప్రభుత్వం సహకారంతో సర్వే చేసి ర్యాంక్ విడుదల చేస్తారు.

మియావాకీ ప్లాంటేషన్

జపాన్‌కు చెందిన వ్యక్తి రూపొందించిన మియావాకీ (మినీఫారెస్ట్) ప్లాంటేషన్ జేఎన్‌టీయూకేలో ఏర్పాటు చేశారు. ప్రధాన గ్రంథాలయం పక్కన 2020 సంవత్సరంలో 2 వేల 20 మొక్కలతో అర ఎకరం పైగా అన్ని రకాల మొక్కలు నాటి దానిని మినీ ఫారెస్ట్‌గా ఏర్పాటుచేశారు. ఎంత ఉష్ణోగ్రత ఉన్నా ఈ ప్రాంతమంతా చల్లగా ఉంటుంది.

జంగిల్ బుక్

గురుకులాల తరహాలో డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ బిల్డింగ్ వద్ద జంగిల్ బుక్ పేరుతో వృక్షాల మధ్య విద్యార్థులకు తరగతులు బోధించే విధానం ఏర్పాటు చేశారు. పై రెండు సరికొత్త ప్రాజెక్టులు అప్పుడు వర్సిటీ గ్రీన్ ఇన్షియేటివ్ డైరెక్టర్‌గా, ప్రస్తుతం డీఏపీగా ఉన్న ప్రొఫెసర్ మురళీకృష్ణ రూపొందించారు.

కాలుష్య రహితంగా..



నగరం నడి మధ్యలో ఉన్న వర్సిటీని కాలుష్య రహిత ప్రదేశంగా తీర్చిదిద్ది ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పాటు చేయాలనేది నా లక్ష్యం. ఇప్పటికే ప్రతి శనివారం క్యాంపస్‌లో ఏ విధమైన వాహనం ప్రవేశించకుండా నడిచే విధులకు హాజరవుతున్నాం. విద్యార్థులకు చదువుతో పాటు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించినప్పుడే సార్థకత ఏర్పడుతుంది. అలాగే వర్సిటీతో పాటు అనుబంధ కళాశాలలో 75 ఏళ్ల పైబడి ఉన్న వృక్షాలకు ఏడాదికి రూ.2500 పింఛన్ ప్రకటించాను. పచ్చని పకృతిని సృష్టించేలా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం.

– డాక్టర్ జీవీఆర్ ప్రసాద్‌రాజు, వీసీ, జేఎన్‌టీయూకే

ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతో పర్యావరణ పరిరక్షణ



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, ప్రిన్సిపాల్ తిరుపాణ్యం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తిరుపాణ్యం పేర్కొన్నారు. రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి, బీబీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పర్యావరణ పరిరక్షణ పోటీలు నిర్వహించారు. 48 పాఠశాలల నుంచి 321 మంది విద్యార్థులు పాల్గొనగా ప్రతిభ చూపిన వారికి ఎంఎల్‌సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ బహుమతులు అందజేశారు. జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు కేఎంఎంఆర్ ప్రసాద్, జిల్లా కో-ఆర్డినేటర్ కేసరి శ్రీనివాసరావు, షేక్ అహ్మద్, అలపాటి శ్రీనివాస్, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ వినిల్ పాల్గొన్నారు.

వృక్షో రక్షతి రక్షితః



కాకినాడ కల్చరల్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక రామారావుపేటలోని ఆదిగురు యోగ పీఠానికి చెందిన యోగ గురువు సద్గురు సచ్చిదానంద యోగి ఆదివారం నౌలిక్రియ ద్వారా తన పొట్ట కండరాలను చెట్టు ఆకృతిలో ఏర్పరిచి 'వృక్షో రక్షతి రక్షితః' అనే సందేశాన్ని ఇచ్చారు.

కార్మికులకు వేసవి భత్యం ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న రంబాల సతీష్

కాకినాడ సిటీ: పరిశ్రమల్లో పని చేసే కార్మికులకు నెల వేతనంతో పాటు 30 శాతం అదనంగా వేసవి భత్యం ఇవ్వాలని అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య డిమాండ్ చేసింది. ఆదివారం కాకినాడ ఏఐఎఫ్‌టీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఏప్రిల్ నుంచి జూన్ వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్న నేపథ్యంలో వేసవికాలం అంతటా ఉమ్మడి జిల్లాలో వివిధ పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులకు మూడు నెలల కాలానికి నెలవారి వేతనంతో పాటు అదనంగా 30 శాతం సమ్మర్ అలెవెన్స్‌లు ఇవ్వాలని యాజమాన్యాలను డిమాండ్ చేశారు. ఏఐఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రంబాల సతీష్, జిల్లా కమిటీ సభ్యులు డి నారాయణమూర్తి, ఎం నాగమణి, వివిధ పరిశ్రమల కార్మికులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సేవలో ప్రత్యేక శ్రద్ధ అవసరం

బోట్‌క్లబ్: దివ్యాంగులకు అవసరమైన సేవా కార్యక్రమాల నిర్వహణలో సభ్యులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని రోటరీ గవర్నర్ భాస్కర్‌రామ్ అన్నారు. రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఆదివారం ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. రోటరీ సభ్యులు అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్లబ్ అధ్యక్షులు జీవీ కృష్ణప్రకాష్ మాట్లాడుతూ రోటరీ గవర్నర్ పర్యటన విజయవంతం కావడానికి సహకరించిన సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మాజీ గవర్నర్ ఎస్‌వీఎస్ రావు, అసిస్టెంట్ గవర్నర్ వడ్డాది ఆదిత్య, సభ్యులు పాల్గొన్నారు.

పంచభూతాలను కలుషితం కానీయొద్దు



ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ ఉమర్ ఆలీషా, డీఎస్పీ వెంకటేశ్వరరావు

- ఆధ్యాత్మిక గురువు ఉమర్ ఆలీషా
- ఉత్సాహంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

కాకినాడ రూరల్: ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించి పంచభూతాలు కలుషితం కాకుండా ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించుకోవాలని విశ్వ విజ్ఞాన విద్యాధ్యాత్మిక పీఠాధిపతి, సద్గురువు డాక్టరు ఉమర్ ఆలీషా పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని వాకలపూడి ఆశ్రమంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉమర్ ఆలీషా, ట్రాఫిక్ డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తొలుత ఆశ్రమ ప్రాంగణంలో మొక్కలు నాటి, పక్షులకు ధాన్యపు కుచ్చులను వేలాడదీశారు. ర్యాలీకి వచ్చిన వారికి మొక్కలు పంపిణీ చేశారు. అనంతరం ర్యాలీని ప్రారంభించారు. ప్లాస్టిక్ నిరోధిస్తూనే ప్రతి ఒక్కరూ మూడు మొక్కలు నాటడం ద్వారా పంచభూతాలు కలుషితం కాకుండా చూడవచ్చని ఉద్బోధించారు. మరో అతిథి ట్రాఫిక్ డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సేవలకు తాత్వికత జోడించి లక్షలాది సభ్యులను తీర్చిదిద్దుతున్నారని పీఠాధిపతిని అభినందించారు. అనంతరం చేపట్టిన ర్యాలీ బోట్‌క్లబ్ వద్ద ఉమర్ ఆలీషా చలివేంద్రం వరకు సాగింది. పర్యావరణ పరిరక్షణకు కాకినాడ లక్ష్మి, అనిశెట్టి సత్యవతి కీర్తన పాడి ఆకట్టుకున్నారు. ప్రగతి అకాడమిక్ డైరెక్టర్ రఘురామ్, పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు, మహేంద్రవర్మ, రెడ్డి సూర్యప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సదస్యం



భీమేశ్వరస్వామి ఆలయంలో సదస్యం నిర్వహిస్తున్న పండితులు

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయం వీధిలోని బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి వైభవంగా సదస్యం నిర్వహించారు. పండితులు బుచ్చి వెంకటశాస్త్రి, ఆలయ అర్చకులు కొడమంచిలి కార్తీక్, తనికెళ్ల బుచ్చిబాబు, కొడమంచిలి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ పూజలు నిర్వహించారు. కల్యాణోత్సవంలో భాగంగా సోమవారం రాత్రి స్వామి శ్రీపుష్పయాగం నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ రాజనాల విజయసారధి తెలిపారు.

జోరుగా సమ్మర్ క్రికెట్ టోర్నీ



వేళంగి హైస్కూలులో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులను అందజేస్తున్న దుర్గాప్రసాద్

కరప: మండలం వేళంగిలోని మెర్లాస్ జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో వేళంగి గ్రాడ్యుయేట్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్రికెట్ టోర్నీ రెండో దశ జోరుగా సాగుతోంది. అండర్-19 విభాగంలో జరిగిన మొదటి మ్యాచ్‌లో వలసపాకల జట్టుపై వేములవాడజట్టు విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా మణికంఠ (వేములవాడ) నిలిచాడు. రెండో మ్యాచ్‌లో భావారం జట్టుపై సిరిపురం జట్టు విజయకేతనం ఎగురవేసింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా గౌతమ్‌కుమార్ (సిరిపురం) నిలిచాడు. నో ఏజ్ లిమిట్ విభాగంలో జరిగిన మొదటి మ్యాచ్‌లో వేళంగి వారియర్స్ జట్టుపై దొడ్డంపేట జట్టు విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో గొర్రిపూడి జట్టుపై గురజనాపల్లి జట్టు గెలుపొందింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా రవి(గురజనాపల్లి) నిలిచాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులను వేళంగి గ్రామ వలంటీర్ల సంఘం అధ్యక్షుడు తోలుం దుర్గాప్రసాద్ అందజేశారు.

గ్రీష్మానికి సంద్రమే ఉపశమనం



కాకినాడ సూర్యారావుపేట బీచ్‌లో జన సందడి

కాకినాడ రూరల్: రెండు రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు అమాంతం పెరిగిపోయి ఉక్కపోతతో ఇళ్లలో ఉండలేని పరిస్థితుల్లో జనాలు సూర్యారావుపేట బీచ్‌కు పోటెత్తారు. ఆదివారం మధ్యాహ్నం వేలాదిగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల నుంచి వచ్చిన ప్రజలతో బీచ్ కిక్కిరిసింది. జలకాలాటలతో సాయంత్రం వరకు సరదాగా గడిపి ఉపశమనం పొందారు. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారి వరుణుడు కరిణించి ఒక్కసారిగి ఉరుములు, మెరుపులుతో కూడిన వర్షం పడడంతో జనాలు రెండు రోజులుగా పడిన వేసవి తాపాన్ని మరిచిపోయారు.

చురుగ్గా కోనేటి పూడిక తీత



సామర్లకోట పంచారామ క్షేత్ర కోనేరులో పూడికతీత పనులు

సామర్లకోట: స్థానిక బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయ కోనేరులో పూడిక తీత పనులు జోరుగా జరుగుతున్నాయి. ఎంపీ వంగా గీత చొరవతో కేంద్ర పురావస్తు శాఖ అధికారులు పూడిక తీత, అభివృద్ధి పనులకు రూ.33 లక్షలు మంజూరు చేశారు. ఇటీవల భారీ వర్షాలు కురియడంతో కోనేరులో చేరిన నీటిని జేసీబీల ద్వారా నీటిని బయటకు తోడుతున్నారు.

బయటి పనులకు మట్టి తరలింపు..

అలాగే కోనేటిలోని మట్టిని ఆలయ అవసరాలకు వినియోగించాల్సి ఉండగా బయటి వ్యక్తులకు ఇస్తున్నారని ట్రస్టు బోర్డు సభ్యుడు చల్లా సత్తిబాబు ఆరోపిస్తున్నారు. పురావస్తు శాఖ అధికారులపై ఒత్తిడి చేస్తే ఆలయానికి చెందిన విశ్రాంతి భవనం ఆలయం వద్ద కొంత మట్టి వేశారని, తిరిగి బయటకు వ్యక్తులకు తరలిస్తున్నారన్నారని తెలిపారు. విశ్రాంతి భవనం వద్ద ఆవరణ గోతులతో నిండిపోయిందని, దానిని నింపేందుకు సుమారు 500 ట్రాక్టర్ల మట్టి కావలసి ఉంటుందని ఆయన తెలిపారు. పురావస్తు శాఖ పనితీరుపై రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌కు ట్రస్టు బోర్డు ద్వారా ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

బాలు సంగీత సేవలు స్ఫూర్తిదాయకం



బాల సుబ్రహ్మణ్యం చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న వేదిక వ్యవస్థాపకుడు రామ్‌రాజ్ తదితరులు

కాకినాడ కల్చరల్: అమర గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సంగీత సేవలు స్ఫూర్తిదాయకమని ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం స్మారక కళావేదిక వ్యవస్థాపకుడు డి.రామ్‌రాజ్ అన్నారు. స్థానిక ది యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్ దంటు కళాక్షేత్రం ఆవరణలో కళావేదిక ఆధ్వర్యంలో ఆదివారం బాలు జయంతిని ఘనంగా నిర్వహించారు. బాలు చిత్రపటానికి నివాళులు అర్పించారు. వేదిక సభ్యులు కేక్ కట్ చేశారు. ఈనెల 21న సంగీత దినోత్సవాన్ని పురస్కరించుకుని సినీ సంగీత కచేరి, పాటల పోటీలు నిర్వహిస్తామన్నామని వేదిక వ్యవస్థాపకుడు రామ్‌రాజ్ అన్నారు. గాయకులు ఎం.రామారావు, కరక రాజబాబు, వి.గంగా మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గొప్ప నేపథ్య గాయకుడు ఎస్పీబీ

కాకినాడ రూరల్: పలు భాషల్లో సుమారు 50 వేలకు పైగా పాటలు పాడిన గొప్ప నేపథ్య గాయకుడు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం అని అనకాపల్లి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి గింజాల గంగరాజు పేర్కొన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. అడబాల రత్నప్రసాద్, న్యాయవాది యనమల రామం, డాక్టరు సువర్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

వంశ మూలాలను మరువ వద్దు



పుస్తక ఆవిష్కరణలో ప్రముఖులు

గండేపల్లి: వంశ మూలాలను మరువ వద్దని నల్లమిల్లి వంశీయులు పేర్కొన్నారు. దేశ, విదేశాల్లో ఉద్యోగ, వ్యాపార, సినీ, రాజకీయ, వ్యవసాయ రంగాల్లో స్థిరపడిన వీరంతా మండలంలోని సూరంపాలెం ఆదిత్య విద్యాసంస్థల ప్రాగణంలో ఆదివారం కలుసుకున్నారు. కాకినాడ జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షుడు నల్లమిల్లి బుచ్చిరెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో నల్లమిల్లి వంశీకుల చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. గిన్నీస్ బుక్, లిమ్కా బుక్, వండర్ బుక్, తెలుగు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం కోసం దరఖాస్తు చేసుకున్నట్టు నల్లమిల్లి వంశీకులు తెలిపారు. సుమారు మూడు వేల మంది తమ కుటుంబ సభ్యులతో పాల్గొని సందడి చేశారు. కార్యక్రమంలో కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, ఆదిత్య విద్యాసంస్థల అధినేత నల్లమిల్లి శేషారెడ్డి, సినీ హీరో నల్లమిల్లి సుభాష్, దర్శకుడు, రచయిత నల్లమిల్లి వంశీ, హైదరాబాద్ మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, విజయవాడ మెట్రో రైలు ఎండీ నల్లమిల్లి పెద రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధనమ్మ తల్లి తీర్థం



తాళ్లరేవు: స్థానిక మాధవరాయునిపేట గ్రామదేవత ధనమ్మ తల్లి అమ్మవారి తీర్థమహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి అమ్మవారి జాతర సందర్భంగా గరగ నృత్యాలు, డప్పుల వాయిద్యాలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కరాటే క్రీడాకారులకు సత్కారం



ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థులతో చైర్‌పర్సన్ అరుణ తదితరులు

సామర్లకోట: ఇటీవల విశాఖలో జరగిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను లయన్స్ క్లబ్ భవనంలో అభినందించారు. కోచ్ శంకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్ ఉబా జాన్‌మోజెస్ పాల్గొని క్రీడాకారులను, కోచ్ శంకర్‌ను అభినందించారు. ఈ సందర్భంగా కోచ్‌లు శంకర్, బద్రి, కామేష్, ప్రసన్న, భద్రరావులను చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్లు సత్కరించారు. లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ చిత్తులూరి వీర్రాజు, భారతమాత సేవా పరిషత్ అధ్యక్షుడు గొరకపూడి చిన్నయ్యదొర, లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు ఎస్.సుధారాణి, సొసైటీ అధ్యక్షుడు మేకా శ్రీనివాసరావు, లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు గుండు శంకరరావు, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, బాస్కెట్‌బాల్ కోచ్ ఐ.గోపాలకృష్ణ, కౌన్సిలర్ రెడ్డి లోవకుమారి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టోర్నీలో ద్వితీయ స్థానం సాధించిన క్రీడా కారులకు సర్టిఫికెట్లు అందజేశారు.

ముత్యాలమ్మకు క్షీరాభిషేకం

తాళ్లరేవు: జ్యేష్ఠ నక్షత్ర పౌర్ణమి పర్వదినం సందర్భంగా పి.మల్లవరం గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవారికి ఆదివారం క్షీరాభిషేకం నిర్వహించారు. స్థానిక వేంకటేశ్వరస్వామివారి ఆలయ అర్చకులు ఖండవిల్లి శ్రీకృష్ణమాచార్యులు అమ్మవారికి విశేష పూజలు, ప్రత్యేక కుంకుమపూజలు నిర్వహించారు..

నేడు చండీ హోమం

అన్నవరం: సత్యదేవుని తొలిపావంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారి జన్మనక్షత్రం 'మూల' సందర్భంగా సోమవారం అమ్మవారికి చండీహోమం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకూ హోమం, పూర్ణాహుతి నిర్వహిస్తామన్నారు.